క్లుప్తంగా

అనాథాశ్రమానికి సరుకుల వితరణ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో ఉన్న అనాథాశ్రమానికి శనివారం గుత్తి పట్టణానికి చెందిన కైలాష్ ట్రేడర్స్ యజమానులు రాజేంద్ర, కై లాష్ నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఈ సందర్భంగా బియ్యం, బేడలు, చక్కెర, చింతపండు, నూనె, ఉల్లిపాయలు వంటివి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, పేట బసవేశ్వరాలయం ధర్మకర్త శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేయాలి

గుంతకల్లు: దోనిముక్కల రోడ్డులోని టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు నియోజకవర్గ ఇంచార్జ్ దౌల్తాపురం ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు టిడ్కో అపార్ట్‌మెంట్ ఏరియాను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ టిడ్కో నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా అసంతృప్తిగా దర్శనమిస్తాయన్నారు. పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, తగరం రామాంజనేయులు, మహబూబ్‌బాషా, రామచంద్ర, యూసఫ్, దాసరి రవికుమార్, దీప్తి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు


మాట్లాడుతున్న ఎస్‌ఐ కాటయ్య

తాడిపత్రి రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని ఎస్‌ఐ కాటయ్య, ఏఎస్‌ఐ గౌస్ సూచించారు. మండలంలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ విద్యార్థులతో వారు సమావేశమయ్యారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమన్నారు. వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామనాథ్, ఈవెంట్ ఈవెంట్ ఆర్గనైజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శనివారం రాము అనే యువకుడిపై నాగేంద్ర అనే యువకుడు దాడి చేశాడు. బాధితుడి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బేతాపల్లికి చెందిన రాము కొత్తపేట గ్రామంలో వద్ద ఉన్న రాయల్టీ చెక్‌పోస్టులో పని చేస్తున్నాడు. జక్కలచెరువు గ్రామానికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి రాయల్టీ చెల్లించుకుండా కంకర తోలుకుంటుండగా.. విధుల్లో ఉన్న రాము ట్రాక్టర్‌ను అడ్డుకుని రాయల్టీ చెల్లించాల్సిందిగా కోరాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుని నాగేంద్ర కర్రలతో దాడి చేయడంతో వీపు, నడుము వద్ద గాయాలవడంతో రామును గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని సామాన్ల అపహరణ


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక వ్యవసాయ పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన సామాన్లు అపహరణకు గురయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు.. కోటంకకు చెందిన యల్లమ్మ, భాస్కర్‌రెడ్డి తమ వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం రాత్రి దుండగులు పగలగొట్టారు. అందులో ఉన్న అల్యూమినియం, కాపర్ వైర్లు, ఆయిల్, విలువైన సామాన్లు ఎత్తుకెళ్లారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: పట్టణ శివార్లలోని గుత్తి అనంతపురం గ్రామ శివారులో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి ఓబుళపతి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఓబుళపతి తన బావమరిదిని పెద్దవడుగూరు మండలంలోని విరుపాపురం గ్రామంలో వదిలేందుకు వెళ్లాడు. తిరిగి గుత్తి పట్టణానికి వస్తుండగా గుత్తి అనంతపురం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృత్యు మలుపు


గత నెల23న ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న దృశ్యం

● ప్రాణాలు తీస్తున్న తలగాచిపల్లి క్రాస్ ● బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రయాణికులు

గార్లదిన్నె: మండలంలో 44వ జాతీయ రహదారిపై తలగాచిపల్లి క్రాస్ ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలోనే హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు వాహనాలు వెళ్తుంటాయి. నిత్యం జాతీయ రహదారి రద్దీగా ఉంటుంది. ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ రోడ్డుపైనే స్థానిక గ్రామాలైన తిమ్మంపేట, తలగాచిపల్లి గ్రామాల ప్రజలతో పాటు స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు.అయితే తరుచూ ఇక్కడే ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. తలగాచిపల్లి క్రాస్‌లో రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడగా మరి కొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రయాణికులు, వాహన దారులు మలుపు వద్దకు రాగానే భయపడుతున్నారు. తలగాచిపల్లిక్రాస్ వద్ద వై జంక్షన్ ఉండడంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంది. నెల వ్యవధిలో మూడు ప్రమాదాలు జరిగి 8 మంది మృతి చెందగా 20 మంది దాకా తీవ్రంగా గాయపడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో పాటు శింగనమల మండలం లోలూరు క్రాస్, బుక్కరాయసముద్రం మండలం బి.కొత్తపల్లి, వడియంపేట, ప్రాంతాల్లో 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

తలగాచిపల్లి క్రాస్‌లో రోడ్డు ప్రమాదాలు ఇలా...

- 2024, నవంబర్ 23న ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొని 8 మంది వ్యవసాయ కూలీలు మృతిచెందడంతోపాటు ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- అక్టోబర్ 5న ద్విచక్రవాహనం రోడ్డుపై బోల్తా పడి పామిడి మండలం కండ్లపల్లికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు.
- అక్టోబర్ 11న అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు, కంటైనర్ ఢీ కొని బస్సులో ఉన్న 12 మందికి తీవ్రగాయాలయ్యాయి.
- సెప్టెంబర్ 15న అర్ధరాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి.
- సెప్టెంబర్ 29న అర్ధరాత్రి ఐచర్, ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఐచర్‌లో ఉన్న 12 మంది వ్యవసాయ కూలీలకు తీవ్రగాయాలయ్యాయి.
- 2023, జూలైలో ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు.
- ఏప్రిల్ 30న ద్విచక్రవాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందారు.
- 2022, మే 1న లారీ,కంటైనర్ ఢీ కొని డ్రైవర్ మృతి చెందాడు.
- ఏప్రిల్‌లో లారీ,ద్విచక్రవాహనం ఢీకొనంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.


గార్లదిన్నె మండలంలో ప్రమాదకరంగా ఉన్న తలగాచిపల్లి క్రాస్

సర్వీస్ రోడ్డు మరమ్మతులు చేయాలి



తిమ్మంపేట, తలగాచిలపల్లి గ్రామాల మధ్య ఉన్న 44వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు గుంతలు పడి, కంప చెట్లు పెరగడంతో వాహనాలు రోడ్డుపై వెళ్లకుండా తలగాచిపల్లి క్రాస్ వద్ద గార్లదిన్నెలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి నిర్వాహకులు సర్వీస్ రహదారికి తారు రోడ్డు నిర్మిస్తే గుంతకల్లు, గుత్తి, పామిడి, నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తిమ్మంపేట, కనంపల్లి, తలగాచిపల్లి నుంచి వచ్చే వాహనాలు, ఆటోలు, స్థానికులు గార్లదిన్నెలోకి రోడ్డు దాటకుండా సర్వీస్ రోడ్డు వెంబడి శింగనమల క్రాస్ బ్రిడ్జి వద్ద నుంచి వెళ్తాయి.దీంతో రోడ్డు ప్రమాదాలు కొంతవరకూ తగ్గించవచ్చు. – వెంకటశివారెడ్డి, తిమ్మంపేట

ప్రమాద సూచికలు ఏర్పాటు చేశాం



మండలంలో గార్లదిన్నె తలగాచిపల్లి క్రాస్, కల్లూరు తరిమెల క్రాసింగ్‌లు బ్లాక్ స్పాట్‌గా గుర్తించాం. గత నెల 23న తలగాచిపల్లి క్రాస్ వద్ద ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో 8 మంది వ్యవసాయ కూలీలు మృతి చెందడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు బ్లాక్ స్పాట్‌లో స్పీడ్ బ్రేకర్లు ఎత్తు పెంచి, రంగులు వేసి, సూచికల బోర్డు ఏర్పాటు చేశాం. అలాగే మండలంలో గార్లదిన్నె విద్యుత్ సబ్ స్టేషన్ , కనంపల్లి క్రాస్, ముంటిముడుగు క్రాస్‌ల వద్ద కూడా ప్రమాదాలు జరుగుతుండడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాం. వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. – గౌస్ మహమ్మద్ బాషా, ఎస్‌ఐ

రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఏడీజే శ్రీహరి

గుత్తి: న్యాయవాదులు రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏడీజే కోర్టులో శనివారం మీడియేషన్ (మధ్య వర్తిత్వం) కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులు ఇరు వర్గాలకు చెందిన కక్షిదారులను పిలుపించుకుని న్యాయ వ్యవస్థలో ఉన్న సెక్షన్లపై అవగాహన కల్పించాలన్నారు. ఇలా చేయడం వల్ల కోర్టులకు వచ్చే కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశముంటుందన్నారు. న్యాయవాదులందరూ కలిసికట్టుగా ఉండి కోర్టుల్లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామశర్మ, పీడీ రత్నం, సీనియర్ న్యాయవాదులు వెంకట రెడ్డి, రాంగోపాల్, శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, ఎంవీ మహేష్‌కుమార్, మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి


గుంతకల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం


యాడికిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వక్తలు అన్నారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని కేజీబీవీ, ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం హెచ్ఎంల అధ్యక్షతన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారులు, అనధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. కాగా తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నెలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశానికి వైఎస్‌ఆర్‌సీపీ సర్పంచ్ నీరజను హెడ్ మాస్టర్ ఆహ్వానించలేదు. ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్ తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న మాలధారులు

శింగనమల: శింగనమలలోని అయ్యప్ప, శివ మాలధారులు శనివారం అయ్యప్ప గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప స్వాములు పడి పూజ నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 7 గంటల నుంచి గ్రామంలో గ్రామోత్సవం చేశారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండలంలో మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు.

నెట్టికంటుడికి వెండి హారం వితరణ


వెండి హారాన్ని అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: బెంగుళూరుకు చెందిన దేవా లక్ష్మీదేవి అనే భక్తురాలు శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారికి 1.25 కిలోల వెండి హారాన్ని బహూకరించారు. ఈమేరకు ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లుకు అందించారు.

ఎలెక్ట్రికల్, ప్లంబింగ్, ల్యాండ్ సర్వేలో ఉచిత శిక్షణ

గుంతకల్లు రూరల్: గుంతకల్లు – గుత్తి రోడ్డులో ఉన్న న్యాక్ స్కిల్‌హబ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎలెక్ట్రికల్, ప్లంబింగ్, ల్యాండ్ సర్వే విభాగాల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ 701388450, 8639576482 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చింతల వేంకటరమణుడి పవిత్రోత్సవాలు


అలంకరణంలో చింతల వేంకటరమణస్వామి, అమ్మవార్లు

తాడిపత్రి అర్బన్: స్థానిక చింతల వేంకటరమణస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా కొనసాగాయి స్వామి వారి ప్రధానాలయ వెలుపల ప్రాకార మండలంలో ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తులకు అర్చకుడు మురళి బట్టార్ తిరుమంజనాలు చేశారు. స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఏవైనా పొరపాట్లు జరిగి ఉన్నా, భక్తుల వల్ల ఏదైనా దోషాలు కలిగి ఉంటే అవి తొలగిపోవాలంటూ పవిత్రోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం స్వామి వారికి చతుస్థానార్చన, హోమము, పూర్ణాహుతి, కార్యక్రమాలు చేపట్టారు. స్వామి, అమ్మ వారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు, అనుబంధ ఆలయాల్లో ఉన్న విగ్రహాలకు 108 నూలు, దారాలతో తయారు చేసిన పవిత్ర మాలలను పుణ్య జలాలతో సంప్రోక్షించి పూజలు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి తిరుచ్చిలో శ్రీవారు గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం


గార్లదిన్నెలో అలంకరణలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి


గుంతకల్లులో స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం షష్టి సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామికి జయజయధ్వానాల మధ్య స్వామివారి కళ్యాణం అర్చకులు కనులపండువగా జరిపించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

గుంతకల్లు: పట్టణంలోని సత్యనారాయణపేటలో ఉన్న ఆదెప్పతోట సమీపంలోని సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో షష్టి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు బి.రామచంద్రశర్మ ఆధ్వర్యంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించి విశేష పూజలు చేశారు. భక్తులు స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

యాడికి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం ప్రధాన గేట్ వద్ద ఉన్న ఇనుప కడ్డీలు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన గేటు వద్ద ఉన్న దిమ్మె ఏడాది క్రితం పడిపోయి.. వాటికి ఉన్న ఇనుప కడ్డీలు బయటకు పొడుచుకొచ్చాయి. ఈ ప్రధాన గేట్ లోపు తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయం, నం: 3,4 సచివాలయాలు, ఆధార్ సెంటర్ ఉన్నాయి. ఈ గేట్ నుంచి అధికారుల వాహనాలు, ప్రజల ద్విచక్ర వాహనాలు, విద్యార్థులు తిరుగుతుంటారు. కార్యా లయం లోపల నుంచి బయటకు వచ్చేటప్పుడు ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఇనుప కడ్డీల వల్ల అదుపుతప్పుతుంటాయి. ఈ కడ్డీల వలన ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమైన కార్యాలయాలకు ప్రధాన గేట్ లేకపోవడంతో దొంగలు పడే ఆస్కారం ఉందన్నారు. రోజూ ఇదే దారి గుండా వాహనాల్లో వెళ్తున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు ప్రమాదకంగా ఉన్న ఇనుప కడ్డీలను తొలగించి పడిపోయిన దిమ్మెను మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


తహసీల్దార్ ప్రధాన గేట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప కడ్డీలు

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

శింగనమల: ఎస్సీ, ఎస్టీ రైతులు ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బుక్కరాయసముద్రం ఉద్యాన అధికారి శైలజ సూచించారు. శనివారం మండలంలోని నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చీని, జామ, మామిడి, దానిమ్మ, బొప్పాయి, నేరుడు, డ్రాగన్ ఫ్రూటు, అంజూర, ఇతర పండ్ల తోటల పెంపకానికి ఉద్యాన శాఖ , ఉపాధి పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. సూక్ష్మ నీటి పారుదల పథకం కింద 90 శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ మంజూరు చేస్తామన్నారు. కూరగాయల సాగుకూ కూడా ప్రోత్సాహం ఉంటుందన్నారు. టమాటా , మామిడి పంటలకు రబీ సీజనులో ఎకరాకు రూ.1600 ప్రీమియం కట్టడం ద్వారా బీమా వర్తిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు పంట కోత అనంతరం నిల్వ , గ్రేడింగ్ చేసుకోవడానికీ ప్యాక్ హౌస్ పథకం అందుబాటులో ఉందన్నారు. ఎండ కాలంలో నీటి ఎద్దడి అధిగమించడానికి ఫారం పాండ్స్ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సిబ్బంది ఉమాదేవి, అనూష, అమరేష్, రైతులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు హాజరు కావాలన్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని అనంతపురం మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు.శనివారం యర్రగుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇన్సిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్ మెంట్ న్యూఢిల్లీ వారి ఆధ్వ ర్యంలో ఐటీసీ సహకారంతో విద్యార్థులకు ఆయోడిన్ ఉప్పుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య, హెచ్ఎం గురుకుమార్, సిబ్బంది మహమ్మద్, సుదర్శన్ రెడ్డి, పోతులయ్య, రహీన, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెద్దపప్పూరు: మండలంలోని శింగనగుట్టపల్లిలో కుటుంబ కలహాలతో వివాహిత శివలక్ష్మి (35) విష రసాయన తాగి ఆత్మహత్య చేసుకుంది . వివరాలు.. శుక్రవారం ఆమె విష రసాయన తాగడంతో.. బంధువులు చికిత్స నిమిత్తం ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. భర్త నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు.